BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 23 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## నేడు రాష్ట్ర క్యాబినెట్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర మంత్రి వర్గం గురువారం భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపైనే ప్రధానంగా చర్చ జరగనుంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం న్యాయ నిపుణుల కమిటీ వేసింది. న్యాయ నిపుణుల నివేదిక ప్రభుత్వానికి చేరింది. దీనిపై చర్చించి బీసీ రిజర్వేషన్లపై తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. అలాగే ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేసే ఆర్డినెన్స్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఎస్‌ఎల్‌బీసీ, కాళేశ్వరం పునరుద్ధరణ, తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల నిర్మాణం సహా పలు ప్రాజెక్టులపై మంత్ర్రివర్గం చర్చించనుంది. అలాగే ఎస్‌ఆర్‌ఎస్‌పీ రెండో దశకు రామిరెడ్డి దామోదర్‌రెడ్డి పేరుకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. రైతు భరోసాపై క్యాబినెట్ చర్చించనుంది. వీటితో పాటు మరిన్ని అంశాలు మంత్రి వర్గ సమావేశంలో చర్చకు రానున్నట్టు సమాచారం.

## చెక్ పోస్టులు మూసివేత



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రవాణా శాఖకు సంబంధించిన అన్ని చెక్ పోస్టులను తక్షణం మూసివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రవాణా కమిషనర్ డీటీఓలకు ఆదేశాలు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా రవాణా అధికారులు (డీటీఓ) స్వయంగా చెక్ పోస్టుల వద్ద ప్రస్తుతం ఉన్న బోర్డులను, బారికేడ్లను తొలగించే కార్యక్రమాన్ని పర్యవేక్షించి, చెక్ పోస్టులు మూసి వేయబడినట్లుగా కొత్త బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

చెక్ పోస్టుల వద్ద విధుల్లో సిబ్బంది ఎవరూ లేకుండా తక్షణమే ఉపసంహారించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో చెక్ పోస్టులను సూచిస్తూ ఉన్న బోర్డులు, బారికేడ్లను తక్షణం తొలగించాలని డీటీఓలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తొలగింపు ప్రక్రియను మొత్తం వీడియో తీసి దాన్ని భద్రపరచాలని చెప్పారు.చెక్ పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, ఫర్నీచర్, ఇతర సామగ్రి, కంప్యూటర్లు, ఇతర వస్తువులను తక్షణం డీటీఓ కార్యాలయాలకు తరలించాలని, అలాగే పరిపాలనకు సంబంధించిన రికార్డులు, క్యాష్ బుక్స్, రిసిప్టులు, చాలాన్లను అన్నింటినీ డీటీవో కార్యాలయంలో భద్రపరచాలని ఆదేశించారు.

ఇంతకాలం చెక్ పోస్టులు నిర్వహించిన స్థలాల్లో వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నారు. చెక్ పోస్టులను మూసివేసినట్టుగా, సిబ్బందిని రీడిప్లాయ్ చేసినట్టు, రికార్డులను భద్రపరిచిన విషయాలన్నింటిపైనా ఈరోజు సాయంత్రం 5 గంటలలోపు నివేదిక అందించాలని డీటీఓలను ఆదేశిస్తూ రవాణా శాఖ కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో రవాణాశాఖ కమిషనర్ కే సురేంద్రమోహన్ బుధవారం సాయంత్రం 5 గంటలకల్లా అన్ని చెక్‌పోస్టుల్ని మూసేసి, తాళాలు సంబంధిత కార్యాలయాల్లో అందజేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని ఖైరతాబాద్ రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్రువీకరించారు. రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టుల్ని మూసేస్తున్నామని ప్రకటించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక చెక్‌పోస్టుల అవసరం తగ్గిపోయిందనీ, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇప్పటికే చెక్‌పోస్టులు రద్దు అయ్యాయని తెలిపారు. రద్దయిన చెక్‌పోస్టు మార్గాల ద్వారా రాష్ట్రంలోకి అక్రమ రవాణా జరక్కుండా మొబైల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల సంఖ్యను పెంచుతామన్నారు. రాష్ట్రంలో అమల్లోకి తెచ్చిన ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) పాలసీ ద్వారా రూ.577 కోట్ల పన్ను మినహాయింపులు ఇచ్చామన్నారు. దీనివల్ల ఈవీ అమ్మకాలు 0.03 శాతం నుంచి

మిగితా 4వ పేజీలో

## రెండేండ్లలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేయాలి

- పనుల వేగవంతానికి వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ
- వందేండ్ల అవసరాలకు తగినట్టు వసతుల కల్పన
- పనుల తీరుపై తరచూ క్షేత్ర స్థాయిలో తనిఖీ
- సీఎం రేవంత్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై ముఖ్యమంత్రి గారు ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనుల వేగవంతానికి వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులతో వెంటనే ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రతి పది రోజులకొకసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యాక అక్కడి బందోబస్తు, ట్రాఫిక్ విధుల నిర్వహణకు సంబంధించి ముందుస్తుగానే తగిన ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.

ఆసుపత్రికి వివిధ రహదారులను అనుసంధానించే ప్రణాళికలు ఇప్పటి నుంచే రూపొందించాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల నిర్మాణానికి సంబంధించి ప్రతి నిర్మాణానికి ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. నిర్మాణాలపై 24X7 ఆ అధికారి పర్యవేక్షించేలా పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించాలని చెప్పారు. వచ్చే జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు.

## నలుగురు ఐఏఎస్ అధికారుల బదిలీ

- ఎక్సైజ్ శాఖ కార్యదర్శి రిజ్వీ వాలంటరీకి సర్కార్ అమోదం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



రాష్ట్ర ప్రభుత్వం నలుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనలో బాగంగానే ఈ బదిలీ చేశామని చెప్పారు. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా ఉన్న ఎం.రఘునందన్ రావుకు వాణిజ్య, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జెన్‌కో సీఎండీ హరీశ్‌కు దేవాదాయశాఖ డైరెక్టర్‌గా, ఐటీ అదనపు కార్యదర్శిగా ఉన్న భవేష్ మిశ్రాకు భూగర్భ గనుల శాఖ డైరెక్టర్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ చేసింది. అలాగే వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా వాలంటరీ రిటైర్మెంట్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## ప్రతి జిల్లాకూ 600 పడకల ఆస్పత్రి

- మెడికల్ కాలేజీలకు అనుసంధానంగా..
- ప్రతి 30 కి.మీ పరిధిలో డయాలసిస్ సెంటర్
- త్వరలో 80 ట్రామా సెంటర్ల ఏర్పాటు :
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**బలగం టీవి, సంగారెడ్డి**

రాష్ట్రంలోని ప్రజలందరికీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందించడం ప్రభుత్వ ధ్యేయమని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత హెల్త్ క్యాంపును మంత్రి ప్రారంభించారు. స్వయంగా మంత్రి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సమాజ బాధ్యతతో ప్రజల ఆరోగ్యం, విద్య, వైద్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతాల వరకు ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్టు తెలిపారు. ఎంతటి వైద్యం అయిన జిల్లా కేంద్రాల్లోనే చికిత్స అందించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీసు కుటుంబాల కోసం ప్రత్యేకంగా హెల్త్ క్యాంపు నిర్వహించటం చక్కని ఆలోచన అని, ఈ క్యాంపులో 13 రకాల వైద్య నిపుణులైన డాక్టర్లు పాల్గొంటున్నారని అన్నారు. రాష్టంలో 160 డయాలసిస్ సెంటర్లు ఉన్నా సరిపోవడం లేదని, అందుకే ప్రతి 30 కి.మీకి ఓ డయాలసిస్ సెంటర్ ఉండేలా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే, హైవేలపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి గోల్డెన్ అవర్‌ను దృష్టిలో పెట్టుకొని హైవేలపై త్వరలో 80 ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. జిల్లాకో క్యాన్సర్ డే కేర్ సెంటర్ ఏర్పాటు చేసి కిమోథెరఫీ చికిత్స అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి వాటికి అనుసంధానంగా 600 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలో మెడికల్ కాలేజీ, 500 పడకల ప్రభుత్వాస్పత్రి, పారామెడికల్ కాలేజీ, క్రిటికల్ కేర్ బ్లాక్, అందోల్‌లో నర్సింగ్ కాలేజీ, 5 కొత్త పీహెచ్‌సీలను, మూడు కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బిల్డింగ్‌లను ప్రారంభించామన్నారు. వట్‌పల్లిలో సీహెచ్‌సీ, తెల్లాపూర్‌లో యుపీహెచ్‌సీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పటాన్ చెరు, నారాయణఖేడ్ ఏరియాస్పత్రుల్లో డయాలసిస్ సెంటర్స్‌ను ఏర్పాటు చేశామని, మరో మూడు సబ్ హెల్త్ సెంటర్లను మంజూరు చేశామని అన్నారు. టీజీఐసీసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ పి.ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, ప్రముఖ వైద్యులు కిరణ్ కుమార్, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్లు రాజు గౌడ్, సెక్రెటరీ ఆనంద్, శ్రీధర్, శ్రీహరి, జిల్లా పోలీస్ అధికారులు, వారి కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతిష్ఠాత్మక గ్లోబల్ సదస్సుకు కేటీఆర్‌కు ఆహ్వానం..

**బలగం టీవీ, హైదరాబాద్**




తెలంగాణ మాజీ ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మరో అరుదైన గౌరవం దక్కింది. శ్రీలంకలోని కొలంబోలో జరగబోయే ప్రతిష్ఠాత్మక 'గ్లోబల్ ఎకనామిక్ అండ్ టెక్నాలజీ సమ్మిట్ 2025' సదస్సులో ఆయనకు కీలకోపన్యాసం చేసేందుకు ఆహ్వానం అందింది. ఈ సదస్సు నవంబర్ 10 నుంచి 12, 2025 వరకు కొలంబోలోని 'ది కింగ్స్‌బరీ హోటల్'లో జరగనుంది.

శ్రీలంక సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తరపున, GETSశ్రీలంక డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎ.యు.ఎల్.ఎ. హిల్మీ ఈ ఆహ్వానాన్ని కేటీఆర్‌కు పంపారు. ఇన్నోవేషన్, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ , మరియు ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై చర్చించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నాయకులను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకురానుంది. డాక్టర్ హిల్మీ తన లేఖలో.. ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి రంగాలలో తెలంగాణను భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైన కేంద్రంగా తీర్చిదిద్దడంలో కేటీఆర్ పోషించిన 'విశిష్ట కేటీఆర్ నాయకత్వాన్ని, పాత్రను కొనియాడారు. పెద్ద ఎత్తున పారిశ్రామిక, సాంకేతిక కార్యక్రమాలను ఆయన నడిపించిన విధానం%ొ% అనేక వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకు ఒక ఆదర్శంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

కేటీఆర్ పాల్గొనడం వల్ల "దక్షిణ ఆసియాలోని విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు స్ఫూర్తి పొందుతారని" GETS 2025 సదస్సు కార్యదర్శి తెలిపారు. అలాగే, సాంకేతిక మరియు ఆర్థిక వృద్ధిలో భారతదేశం %-% శ్రీలంక సహకారాన్ని బలోపేతం చేయడానికి ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు వివిధ దేశాల నుండి మంత్రులు, పెట్టుబడిదారులు, స్టార్టప్ నాయకులు మరియు ఆవిష్కర్తలు హాజరవుతారని, సుస్థిరమైన , సాంకేతికత ఆధారిత ఆర్థిక వ్యవస్థలను నిర్మించడంపై దృష్టి సారిస్తారని తెలిపారు.

## తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టండి




- ఆస్ట్రేలియా సంస్థ ఒరికా ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు భేటీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న దిగ్గజ సంస్థ 'ఒరికా' ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లో పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో అంతర్జాతీయ అగ్రగామిగా ఉన్న ఆ సంస్థ సీఈఓ, ఎండీ సంజీవ్ గాంధీ, ఇతర ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో 'ఒరికా' ప్రస్తుత కార్యకలాపాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై ఈ సమావేశంలో చర్చించారు. 'ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. జీసీసీలు, పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పారిశ్రామికాభి వృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎకో సిస్టమ్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం అందుబాటులో ఉంది' అని ఈ సందర్భంగా మంత్రి కంపెనీ ప్రతినిధులకు వివరించారు.ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్, సస్టైయినబిలిటీ, మాన్యుఫాక్చరింగ్, మైనింగ్ రంగాల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. 'పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ, అమలు చేస్తున్న ప్రోత్సాహకర, ప్రగతిశీల విధానాలు అభినందనీయం. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జీసీసీలో డిజిటల్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ తదితర రంగాల్లో 600 మంది హై స్కిల్డ్ నిపుణులకు ఉద్యోగాలు కల్పించాం. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తెలంగాణలో కార్యకలాపాల విస్తరణ, వివిధ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ఒరికా సంస్థ సీఈఓ సంజీవ్ గాంధీ తెలిపారు. 'ఆస్ బయోటెక్ 2025 ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్'లో కీలకోపన్యాసం చేసేందుకు మంత్రి శ్రీధర్‌బాబు ఆస్ట్రేలియాకు వెళ్లారు.

## జర్నలిస్టుల స్థలాన్ని కాపాడిన హైడ్రా



- 38 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ కంచె నిర్మాణం

**బలగం టీవీ, హైదరాబాద్**

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్‌బషీరాబాద్‌లో జర్నలిస్టులకు కేటాయించిన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 25/2 లోని 38 ఎకరాల భూమి చుట్టూ బుధవారం ఫెన్సింగ్ వేసింది. గతంలో భూమిని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి రాష్ట్ర ప్రభుత్వం 2008లో కేటాయించింది. ఈ భూమిని జర్నలిస్టులకు కేటాయిస్తూ హెచ్.ఎం.డీ.ఏ కస్టడీలో ప్రభుత్వం ఉంచిన విషయం విధితమే. అయితే ఈ కేటాయింపులపై కొంతమంది కోర్టుకెళ్లడంతో అక్కడ జర్నలిస్టులకు ప్లాట్ల పంపిణీ జరగలేదు. కోర్టులో వివాదం ఉంటుండగానే.. మరోవైపు అక్కడ ఆక్రమణలు జరుగుతున్నాయని హైడ్రాకు ఆ యూనియన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై అక్కడ రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు కూడా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, హెచ్ ఎండీఏ అధికారులతో కలిసి హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించుకుంది. ఇప్పటికే కొంతమంది ఇళ్లు కట్టుకుని ఉండగా, వాటి జోలికి వెళ్లకుండానే ఇంకా ఖాళీగా ఉన్న భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ఈ విషయమై కొంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేయగా, కోర్టు తీర్పు ప్రకారం ఆ స్థలం కేటాయింపులు జరుగుతాయి. ఈ లోగా అక్రమణలు జరగకుండా ప్రభుత్వ భూమిని కాపాడుతున్నట్టు హైడ్రా స్పష్టం చేసింది. అలాగే అక్కడ ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారితో త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలిస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. ఈ సమావేశంలో హైడ్రా, రెవెన్యూ, హెచ్ ఎండీఏ, మున్సిపల్ అధికారులు కూడా ఉంటారని తెలిపారు.



## పోచారంలో కాల్పుల కలకలం

**బలగం టీవీ, హైదరాబాద్**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి కాల్పుల కలకలం రేపింది. గోశాల నిర్వాహక ప్రతినిధి సోనూ సింగ్‌పై ఇబ్రహీం అనే వ్యక్తి కాల్పులు జరిపినట్టు పోలీసులు వెల్లడించారు. సోనూ సింగ్ ఛాతీ, ఉదరం మధ్య భాగంలో కుడివైపు బుల్లెట్లు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయాల తీవ్రతతో రక్తస్రావం ఎక్కువగా జరగడంతో స్థానికులు అతన్ని సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బీజేపీ చీఫ్ రాంచందర్ రావు, ఎంపీ ఈటల రాజేందర్‌లు ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.సమాచారం అందుకున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితుడు ఇబ్రహీంను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. కాల్పులకు గల కారణాలను ఆరా తీస్తు న్నారు. చీకటి పడిన సమయంలో ఈ ఘటన జరిగి ఉండటంతో నిందితుడి గుర్తింపు, అరెస్టులో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయని పోలీసులు వెల్లడించారు. రాష్ట్రంలో గన్ కల్చర్ పెరుగుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ ఈ ఘటన చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు 321 నామినేషన్లు



**బలగం టీవీ, హైదరాబాద్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు భారీ ఎత్తున నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఏకంగా 321 నామినేషన్‌లను 211 మంది అభ్యర్థులు దాఖలు చేయడంతో అందిరిచూపు జూబ్లీహిల్స్ ఎన్నికలపైనే పడింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో దాదాపు వంద వరకు నామినేషన్‌లు దాఖలవుతాయని భావించినప్పటికీ అంతకు మూడు రెట్ల నామినేషన్‌లు దాఖలు చేశారు. చివరి రోజు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు వచ్చిన వారికే టోకెన్‌లు ఇచ్చి నామినేషన్‌లను స్వీకరించారు. 13వ తేదీన ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియలో 18వ తేదీ వరకు మొత్తం 127 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే 22న చివరి రోజు ఒక్క రోజే 117 మంది అభ్యర్థులు 194 నామినేషన్లు దాఖలు చేయడం విశేషం. ఆదివారం, సోమవారం రెండు రోజులు సెలవు రోజులు కావడం, మంగళవారం ఒక్కరోజే అవకాశం ఉండటంతో అభ్యర్థులు భారీ ఎత్తున తరలివచ్చారు. అభ్యర్థులతోపాటు వారిని బలపరిచేందుకు వచ్చిన వారితో ఎన్నికల అధికారి కార్యాలయం ఆవరణ ఉదయం నుంచి అర్ధరాత్రి దాకా కిటకిటలాడింది. దాంతో మంగళవారం చివరి రోజు అర్ధరాత్రి 2 వరకు నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగింది. ఇక నామినేషన్‌లను పరిశీలించే క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్‌లపై ఇరువైపులా కొన్ని అభ్యంతరాలు వచ్చినప్పటికీ, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీతల నామినేషన్‌లను ఎన్నికల అధికారులు ఆమోదించారు.

వివిధ కారణాలతో కొంతమంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లవని అధికారులు తిరస్కరించారు. ఎలాంటి కారణాలు లేకుండా తమ నామినేషన్ తిరస్కరించారని కొంతమంది అభ్యర్థులు ఆర్వో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. నామినేషన్‌కు కావాల్సిన పత్రాలన్ని సరిగ్గా ఉన్నప్పటికీ కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. రిటర్నింగ్ అధికారి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తన నినాదాలు చేశారు. పోలీసులు వారిని అడ్డకుని అక్కడి నుంచి పంపించారు.

**పకడ్బందీగా నామినేషన్‌ల స్క్రూటీనీ**

జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక నామినేషన్‌ల స్క్రూటీనీ ప్రక్రియ బుధవారం ప్రారంభం కాగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్ పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పకడ్బందీగా నామినేషన్‌ల స్క్రూటీనీ చేపట్టాలనీ రిటర్నింగ్ అధికారి పి. సాయిరాం, సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. భారీ స్థాయిలో నామినేషన్‌లు దాఖలు కావడంతో నామినేషన్ల స్క్రూటీనీ అధిక సమయం పడుతోంది.

## కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ



**బలగం టీవీ, హైదరాబాద్**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో రోడ్ షోలు, ప్రచార వ్యూహాలపై, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశం చర్చకు వచ్చినట్టు సమాచారం.. జూబ్లీహిల్స్‌లో ప్రచారం ఎలా చేస్తున్నారు.. ఓటర్ల నాడీ ఎలా ఉంది అని కేసీఆర్ ఆరా తీసినట్టు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ ప్రచారం, 40 మంది బీఆర్ఎస్ స్టార్ కంపైనర్ల ప్రచార తీరుపై చర్చ సాగినట్టు తెలిసింది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని తిరిగి దక్కించుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తెలియజేయాలని బీఆర్ఎస్ నేతలు వ్యూహాలకు పదును పెడుతున్నట్టు సమాచారం. దీనికితోడు జూబ్లీహిల్స్ ఇన్‌చార్జిలతో ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో కేసీఆర్ పాల్గొంటారన్న చర్చ కూడా జరుగుతోంది.

## మాగంటి సునీత.. గోపీనాథ్ భార్య కాదు

- ఎన్నికల అధికారికి దివంగత నేత గోపీనాథ్ మొదటి భార్య కుమారుడు తారక్ ప్రద్యుమ్న సంచలన లేఖ

**బలగం టీవీ, హైదరాబాద్**



జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత ఎంపికలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాగంటి సునీత.. గోపీనాథ్ భార్య కాదని, ఆమె లీవ్ ఇన్ రిలేషన్‌లో ఉండే వారని గోపీనాథ్ మొదటి భార్య కుమారుడు తారక్ ప్రద్యుమ్న కోసరాజు బుధవారం ఎన్నికల అధికారికి లేఖ రాశారు. సునీత తప్పుడు అఫిడవిట్ సమర్పించారని, ఆమె నామినేషను డిస్ క్వాలిఫై చేయాలని కోరారు. లేఖలో తారక్ ప్రద్యుమ్న పేర్కొన్న వివరాల ప్రకారం.. తన తల్లి మాలినీ దేవిని మాగంటి గోపీనాథ్ 1998 ఏప్రిల్ 29న హిందూ వివాహ చట్టం ప్రకారం వివాహం చేసుకున్నారని, ఆ వివాహం చట్టబద్ధంగానే

మిగితా 4వ పేజీలో

# వృద్ధులు -వృద్ధాప్యం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జీవక్రమంలో బాగంగా పుట్టిన ప్రతి మనిషి వృద్ధులౌతారు. శారీరక మార్పుల వలన శరీర పటుత్వం తగ్గి తమ పనులు తాము చేసుకోలేక పోతారు. కొన్ని సందర్భాల్లో మానసిక స్థితి కూడా దెబ్బతింటుంది. అలాంటి వారికి వారి సంతానం కుటుంబ సభ్యులు సహకరించాలి. కానీ వృద్దాప్యం శాపమైంది. వృద్ధుల జనాభా నానాటికి పెరుగుతోంది, దానికనుగునంగ వారి జీవన ప్రమాణాలు పెరగడం లేదు. వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారు, కొన్ని సందర్భాల్లో హింసకు కూడ గురౌతున్నారు. విచిత్రంగా వారిని నిరాదరణకు, హింసకు గురిచేసేది ఎవరో కాదు, స్వంత పిల్లలు, బంధువులే.

కొన్ని సంఘటనలు హృదయవిదారకంగా ఉన్నాయి/ఉంటున్నాయి. బ్రతికున్నవారిని శ్మశానవాటికలలో వదిలేస్తున్నారు. ఊరికి వెళ్దామని చెప్పి వృద్ధులను బస్టాండులో కూర్చోబెట్టి, ఇక్కడనే కూర్చోండి అని, ఇప్పుడే వస్తామని చెప్పి బస్టాండుల్లో, రైల్వే స్టేషన్లలో వదిలి వెళ్తున్నారు. వారి శేష జీవితం వృద్ధాశ్రమాలలో అనాథ శరణాలయాలలో గడపాల్సిన పరిస్థితి దాపురించింది.

ఒకవైపు వృద్ధులను గౌరవిద్దామని, ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం, జాతీయ వయోవృద్ధుల దినోత్సవం మరియు అంతరాజతీయ వయోవృద్ధుల దినోత్సవం అని ప్రకటించి కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. అధికారుల అవగాహన లోపమో, చిత్తశుద్ధి లేకనో ఇలా జరిపే కార్యక్రమాలు వృద్ధుల జీవితాల్లో ఎలాంటి మార్పులు తీసుకురాలేదు.

వృద్ధులు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా 2007 సంవత్సరంలో తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ సంరక్షణ చట్టాన్ని రూపొందించారు. దాని అమలుకు 2011 సంవత్సరంలో నియమావళిని రూపొందించారు. చాల మంది ప్రభుత్వాధికారులకు ఇలాంటి చట్టం ఒకటున్నదని కానీ దానిపై అవగాహన కానీ లేదు.

**ఒకసారి చట్టం ఏం చెప్పింది చూద్దాం..**

వయోవృద్ధుల ఆస్థిరక్షణ, ప్రాణరక్షణ ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగ ఈ చట్టంలో ఉన్నది.

**తల్లిదండ్రుల వయోవృద్ధుల చట్టం కదా! తల్లి తండ్రులు ఎవరు? వయోవృద్ధులు ఎవరు?**

60 సంవత్సరాల వయస్సు పైబడ్డ వారందరూ వయోవృద్ధులే కాని వయోవృద్ధులు అందరు తల్లిదండ్రులు కారు. పిల్లలున్న వారు మాత్రమే తల్లిదండ్రులు లేనివారు వయోవృద్ధులు. తల్లిదండ్రులను పోషించి సంరక్షించడం వారి పిల్లల బాధ్యత. పిల్లలు లేని వయోవృద్ధుల ఆస్తులను అనుభవించేవారు వారిని పోషించి సంరక్షించాలి. పిల్లలు, ఆస్తులు రెండూ లేనివారి కొరకు సెక్షన్ 19 ప్రకారం ప్రభుత్వాలే శరణాలయాలు ఏర్పాటు చేసి వారికి పోషణ రక్షణ కల్పించాలి.

తల్లిదండ్రుల ఆస్తులు పంచుకొని పిల్లలు వారిని నిరాదరణకు గురిచేస్తే సెక్షన్ 23 ప్రకారం ఆ తల్లిదండ్రులు ఆర్డీవోకు పిర్యాదు చేసి, పిల్లలు మమ్ములను చూడడం లేదు, మా ఆస్తి మాకు తిరిగి ఇప్పించండి అని కోరితే విచారణ జరిపి ఆర్డీవో ఆ ఆస్థిని తల్లిదండ్రులకు తిరిగి బదలాయించే అధికారమున్నది. ఆ తీర్పును వ్యతిరేకిస్తూ జిల్లా కోర్టులో సవాలు చేసే అవకాశం లేదు. కలెక్టర్ గారికి అప్పీలో లేక హైకోర్టులో సవాలో చేయాలి.

సెక్షన్ 21 ప్రకారం ప్రతి పోలీస్ స్టేషన్లో ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో గల వయోవృద్ధుల జాబితా ఉండాలి, వారి పై జరిగే నేరాల నమోదు కొరకు ప్రత్యేక రిజిస్టర్ ఉండాలి. ప్రతి మూడు నెలలు మించక ముందు సదరు పోలీస్ అధికారులు ఆయా వయోవృద్ధుల నివాసాలను సందర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకోవాలి.

ప్రతి పోలీస్ స్టేషన్లో ఒకటి కాని అంతకంటే ఎక్కువ కాని వృద్ధుల సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి. ఆ కమిటీలో సభ్యులుగా వయోవృద్ధుల సంఘంనుండి ఒకరు, స్వచ్ఛంద సంస్థలనుండి ఒకరు, స్త్రీ సిశు సంక్షేమ కమిటీనుండి ఒక స్త్రీ, యూనిఫారం సర్వీసు నుండి పదవీవిరమణ పొందినవారు ఒకరు ఉండాలి.

**వైద్యపరమైన హక్కులు**

సెక్షన్ 20 ప్రకారం ప్రభుత్వ లేక ప్రభుత్వ నిదులతో నిర్వహించే ఆసుపత్రులలో వృద్ధులకు ప్రత్యేకంగా పడకలు ఏర్పాటు చేయాలి. వారికి ప్రత్యేక లైను ఉండాలి. చిన్నపిల్లలకు ఉన్నట్లు వృద్ధులకు కూడా ప్రత్యేక వైద్య విభాగం ఉండాలి. వృద్ధులకు వచ్చే జబ్బుల పై పరిశోధనలు జరగాలి. పీడియాట్రిక్ వలె జీరియాట్రిక్ విభాగం ఉండాలి.

**బ్యాంకింగ్ సేవలు**

వృద్ధుల కోసం ప్రతి బ్యాంకులో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి. 60-70, 70-80 వయసు గల వారికి డిపాజిట్లు పై ఇతరులకంటే వడ్డీ శాతం ఎక్కువ ఉండాలి. ఆదాయపు పన్నులో ప్రత్యేక మినహాయింపులు ఉండాలి. కదిలే పరిస్థితి లేని వృద్ధులకు బ్యాంకు సిబ్బంది వారి ఇంటి వద్దే బ్యాంకు సేవలు అందించాలి.

మానసిక ఉల్లాస కేంద్రాలు.. ప్రతి జిల్లాలో వృద్ధుల కొరకు గ్రంథాలయం, ఇండోర్ గేమ్స్, యోగా, జిమ్ మరియు ఫిజియోథెరపీ సౌకర్యాలతో ఒక డే కేర్ సెంటర్ ఉండాలి. వృద్ధులకు రివర్స్ మార్టగేజ్ సౌకర్యం కూడ కలదు. ఇవన్ని వృద్ధులకు చట్ట ప్రకారం రావాల్సిన హక్కులు. ఇవన్ని తూచ తప్పక పాటిస్తే ప్రభుత్వం శ్రద్ధపెడితే వృద్ధులకు గౌరవప్రదమైన జీవనం లభిస్తుంది.

# సీఎంఆర్ లక్ష్యం గడువులోగా పూర్తి చేయాలి..

- **రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సీఎంఆర్ లక్ష్యం గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. బుధవారం 2024-25 ఖరీఫ్, రబీ సీజన్ సీఎంఆర్ లక్ష్యం పై జిల్లాలోని రైస్ మిల్లర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ 2024-25 ఖరీఫ్, రబీ సీజన్ లో 479922 టన్నుల ధాన్యం దిగుమతి చేసుకున్నారు. దీనికి గాను 324801.263 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా 136711.466 టన్నుల బియ్యం ఎఫ్‌సిఐ కి దిగుమతి చేశారని, ఇంకనూ 188089.799 టన్నుల బియ్యం దిగుమతి చేయాల్సి ఉందని అన్నారు. జిల్లాలోని రైస్ మిల్లర్లందరూ వారికి కేటాయించిన ధాన్యాన్ని ఎఫ్ సీ ఐ కి సీఎంఆర్ అందజేయాలని ఆదేశించారు.

అనంతరం జిల్లాలోని మిల్లుల వారిగా ఇచ్చిన లక్ష్యం వారు పూర్తి చేసిన ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. ఇప్పటివరకు సీఎంఆర్ ఇవ్వడంలో వెనుకబడిన మిల్లులను గుర్తించి వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని, ఆయా మిల్లులను నిత్యం తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎంఆర్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించే రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైస్ మిల్లర్లు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని రైస్ మిల్ యజమానులందరూ సమన్వయంతో ప్రభుత్వం అందించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలనిఅన్నారు. లారీల కాంట్రాక్టర్లు తాము ఇచ్చిన సంఖ్యకు అనుగుణంగా వాహనాలను కేంద్రాలకు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రప్రకాష్, రైస్ మిల్లుల యజమానులు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలలో అకౌంటెంట్, ఏఎన్ఎం కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కె.జి.బి.వి లలోని ఖాళీగా ఉన్న అకౌంటెంట్ మరియు ఏఎన్?ఎం పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన పనిచేయుటకు అర్హత ఆసక్తి కలిగిన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి ఎస్ వినోద్ ఒక ప్రకటన తెలియజేశారు. అభ్యర్థులు స్థానికులై ఉండవలెను ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ ఆధారంగా స్థానికత నిర్ధారించబడును, 18 నుండి 45 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళ అభ్యర్థులు మాత్రమే అర్హులు. జిల్లాలో 3 అకౌంటెంట్? (Category EWS,BC-B,OC), 2. ఏ.ఎన్.ఎం (Category-BC-B,OC) పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అకౌంటెంట్ పోస్టులకు కామర్స్ డిగ్రీతో పాటు certificate course in Basic computer skills (మీా Word, Excel etc) లేదా B.Com Computers అర్హత కలిగి ఉండాలి. పోస్టు గ్రాడ్యుయేట్ క్వాలిఫికేషన్ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వబడును. ఏ.ఎన్.ఎం పోస్టుకు ఇంటర్మీడియట్ తో పాటు ఎ.ఎన్.ఎం ట్రైనింగ్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి. అదేవిధంగా GNM కోర్సు లేదా B.Sc. Nursing అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వబడును. ఎంపిక పూర్తిగా మెరిట్ ఆధారంగా జరుగును.https:// rajannasircilla.telangana.gov.in%/ లో అందుబాటులో ఉంటాయి. అర్హత మరియు ఆసక్తి గల మహిళా అభ్యర్థులు జిల్లా విద్యాధికారి కార్యాలయం ఎస్- 34 జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం సముదాయము, రాజన్న సిరిసిల్ల యందు కింద తెలిపిన తేదీలలో అప్లికేషన్లు సమర్పించగలరు.

**క్రమ సంఖ్య కార్యాచరణ తేదీ / కాలపరిమితి**

1 నోటిఫికేషన్ విడుదల 23.10.2025
2 దరఖాస్తుల స్వీకరణ 24.10.2025 నుండి 27.10.2025 వరకు
3 తాత్కాలిక మెరిట్ లిస్ట్ వెబ్సైట్లో ప్రదర్శన 30.10.2025
4 అభ్యంతరాలు స్వీకరణ 31.10.2025
5 తుది మెరిట్ లిస్ట్ మరియు షార్ట్ లిస్టు ప్రదర్శన 03.11.2025
6 సర్టిఫికెట్ వెరిఫికేషన్ 04.11.2025

# అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం..

- **అదనపు ఎస్పీ చంద్రయ్య**
- **సిరిసిల్లలో విద్యార్థులకు పోలీసుశాఖ పనితీరుపై 'ఓపెన్ హౌస్'**



**బలగం టీవీ, సిరిసిల్ల**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం విద్యార్థిని విద్యార్థులకు 'ఓపెన్ హౌస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, శాఖ పనితీరు, వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. విద్యార్థులు కేవలం చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి, శాంతి భద్రతల విషయంలో అది ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతుంది, దాని పని విధానం ఎలా ఉంటుందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ అవగాహన కల్పన కోసం ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసు శాఖకు సంబంధించిన అనేక అంశాలను క్షుణ్ణంగా వివరించిన విషయాలు.. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ద్వారా ప్రజలకు దగ్గరవుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం అమలు చేస్తున్న డే/నైట్ బీట్స్, పెట్రోలింగ్ వ్యవస్థల పనితీరును తెలిపారు. నేరస్తులను సులువుగా గుర్తించడానికి ఉపయోగించే ఫేస్ రికగ్నిషన్ సిస్టం, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించారు. నేరాలు జరగకుండా నివారించడంలో మరియు జరిగిన నేరాన్ని త్వరగా ఛేదించడంలో సీసీ కెమెరాలు ఎలా ఉపయోగపడతాయో తెలియజేశారు. మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీ టీమ్ లు, భరోసా సెంటర్ల పనితీరు గురించి వివరించారు. పోలీస్ శాఖ ఉపయోగించే ఆయుధాలు, వాటి పనితీరు, ఏ సందర్భాలలో వాటిని ఉపయోగిస్తారో వివరించారు. అలాగే, బాంబ్ స్క్వాడ్స్ బాంబులను ఏ విధంగా నిర్వీర్యం చేస్తాయి, పోలీసు జాగిలాల (డాగ్ స్క్వాడ్) పనితీరుపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించి, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. సైబర్ నేరాల గురించి అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్‌లో అపరిచితులకు దూరంగా ఉండాలని తెలిపారు. ఏదైనా సైబర్ క్రైమ్‌కు గురైనట్లయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని వివరించారు. ఈ అవగాహన కల్పనలో ఆర్మోరర్లు, బాంబ్ స్క్వాడ్ టీం, ఐటీ కోర్, భరోసా సిబ్బంది, షీ టీమ్, ఫింగర్ ప్రింట్స్, కమ్యూనికేషన్ సిబ్బంది విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరును వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, ఆర్.ఐ యాదగిరి, ఆర్.ఎస్.ఐ లు శ్రవణ్ యాదవ్, దిలీప్, పోలీస్ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



# త్వరలో రాజన్న జిల్లాలో మున్నూరు కాపుల సింహ గర్జన..

- **మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య**

**బలగం టీవీ,గంభీరావుపేట**

రాష్ట్రం లో మున్నూరు కాపు జనాభా ను నిర్ణయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందిస్తామని, అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే, సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నమని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య అన్నారు.బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలో లో మున్నూరు కాపు మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొండ దేవయ్య హాజరై మాట్లాడుతూ కులగనన సర్వే లో మున్నూరు కాపుల సంఖ్య తక్కువ గా ఉందని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా మున్నూరు కాపుల సభ్యత్వ నమోదు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ద్వారా అందజేస్తామని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జిల్లా కేంద్రాల్లో సంఘ భవనాలు నిర్మించాలని అన్నారు.త్వరలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో మున్నూరు కాపుల సింహ గర్జన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా మహిళా అధ్యక్షులు కల్లూరి చందన, మండల అధ్యక్షులు మేకర్తి బిక్షపతి, నాయకులు కిరణ్ బాబు, ఎర్ర నర్సయ్య, బోయన్నగారి లింగం, గంట అశోక్, శెట్టి రవి, హన్మాండ్లు, వేశాల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి..

- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఎం హరిత పిలుపు
- ఈ నెల 25వ తేదీతో ముగియనున్న సర్వే..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన "తెలంగాణ రైజింగ్- 2047" సిటిజన్ సర్వే కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్- 2047" సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వ తేదీ తో ముగియనున్నది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున www.telangana.gov.in/telanganarising అనే వెబ్సైట్ ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అందించాల్సింగా జిల్లా కలెక్టర్ ఎం హరిత ఒక ప్రకటనలో తెలియ చేశారు.

## మహిళ హత్య కేసు ప్రధాన నిందితుడు అరెస్ట్

- పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ




**బలగం టీవీ, సిరిసిల్ల**

గత సంవత్సరం సిరిసిల్లలో జరిగిన ఓ మహిళ హత్య కేసులో ప్రధాన నిందితుడిని పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సాంకేతిక ఆధారాల సహాయంతో హైదరాబాద్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ వెల్లడించారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు కూలీలు ఏ1 రూడల్ సదా, ఏ2 రామ్‌బ్రిక్స్ సదా కూలీ పని నిమిత్తం సిరిసిల్లకు వచ్చి అశోక్ నగర్‌లోని రామస్వామి ఇంట్లో గది అద్దెకు తీసుకొని నివసిస్తున్నారు. పని చేసే చోట కోడిముంజకు చెందిన అలకుంట రమ అనే మహిళతో వీరికి పరిచయం ఏర్పడింది. తేదీ 19-03-2024 నాడు సాయంత్రం 6 గంటలకు కూలీ పని పూర్తయిన తర్వాత ఆమెను వారు వారి గదికి తీసుకువచ్చారు. ముగ్గురు కలిసి తెచ్చుకున్న మద్యం సేవించారు. మద్యం సేవించిన అనంతరం, నిందితులు ఇద్దరూ కలిసి రమపై ఒకరి తరువాత ఒకరు లైంగికదాడికి యత్నించారు. అయితే ఆమెకు మత్తు వదలడంతో ప్రతిఘటించింది. ఈ విషయం ఎవరికైనా చెబుతుందనే అనుమానంతో ఇద్దరు నిందితులు కలిసి రమను హత్య చేశారు. ఈ హత్యపై సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా, ఏ2 నిందితుడు రామ్‌బ్రిక్స్ సదాను గత సంవత్సరమే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగింది.అయితే, అప్పటి నుండి తప్పించుకొని తిరుగుతున్న ప్రధాన నిందితుడు ఏ1 రూడల్ సదా ఫోన్ నంబర్లు మారుస్తూ, వివిధ రాష్ట్రాల్లో మకాం మారుస్తూ వచ్చాడు. పోలీసులు సాంకేతికత ఆధారంగా అతని ఆచూకీని కనుగొన్నారు. అతను హైదరాబాద్‌లోని అల్వాల్‌లో ఉంటు న్నట్లు గుర్తించి బుధవారం అతడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తెలిపారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా యువజనోత్సవాలు..

- 28న సిరిసిల్ల పట్టణంలోని మినీ స్టేడియంలో పోటీలు

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా యువజనోత్సవాలు నిర్వహించబడుతున్నాయి. ఈ పోటీల ద్వారా 15 నుండి 29 సంవత్సరాల వయస్సు గల యువ కళాకారులను ఎంపిక చేయనున్నారు. అక్టోబర్ 28, 2025న సిరిసిల్ల పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ పోటీలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగనున్నాయి. ఆసక్తి గల యువతీ యువకులు ఎలాంటి రుసుము లేకుండా ఈ పోటీలలో పాల్గొనవచ్చు. ఈ పోటీలలో మొదటి స్థానం సాధించిన కళాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి, రాష్ట్రస్థాయి విజేతలను జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు అర్హులను చేస్తారు.

ఈ యువజనోత్సవాలు ప్రధానంగా రెండు ట్రాక్‌లలో జరుగుతాయి. మొదటి ట్రాక్ "వికసిత్ భారత్ యూత్ లీడర్ డైలాగ్ ". ఈ ట్రాక్‌లో పాల్గొనదలచిన అభ్యర్థులు తప్పనిసరిగా "My Bharat / My Govt.in" పోర్టల్ (%https://mybharat.gov.in/yuva-register) ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ విభాగంలో ఆన్‌లైన్ వ్యాస రచన పోటీలు అక్టోబర్ 23 నుండి నవంబర్ 5 వరకు, వికసిత్ భారత్ పీపీటీ ఛాలెంజ్ నవంబర్ 24 నుండి డిసెంబర్ 8 వరకు, వికసిత్ భారత్ ఛాంపియన్‌షిప్ జనవరి 10 నుండి 12, 2026 వరకు జరుగుతాయి.

రెండవ ట్రాక్ కల్చరల్ మరియు ఇన్నోవేషన్ ట్రాక్. ఇందులో జానపద నృత్యం (1-10 మంది (గ్రూప్), జానపద గేయం, ప్రకటనలు, కథా రచన, చిత్రకళ, పద్య రచన/కవితా రచన, సైన్స్ మేళ ప్రదర్శన వంటి పోటీలు నిర్వహించబడతాయి. పాల్గొనేవారు తమ అంశాలకు అనుగుణంగా అవసరమైన వాయిద్య పరికరాలు, కాస్ట్యూములతో స్వయంగా హాజరుకావాలి. ఈ ఖర్చులు పాల్గొనేవారే భరించవలసి ఉంటుంది. అక్షరాస్యులు మరియు నిరక్షరాస్యులు ఇద్దరూ ఈ పోటీలలో పాల్గొనవచ్చు. అయితే పోటీలలో పాల్గొనదలచిన వారు రాజన్న సిరిసిల్ల జిల్లా నివాసులై ఉండాలి.

ఉత్సాహవంతులైన అభ్యర్థులు తమ పేర్లను అక్టోబర్ 27, 2025 సాయంత్రం 5 గంటల లోగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ కార్యాలయంలో (రెండవ అంతస్తు, రూమ్ నెం.19) నమోదు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం కార్యాలయ సెల్ నంబర్లు 9440239783, 7569207411లో సంప్రదించవచ్చు. ఈ సందర్భంగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఎ. రాందాస్ మాట్లాడుతూ, ఈ యువజనోత్సవాలు యువతలోని ప్రతిభను వెలికి తీయడంతో పాటు వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించడానికి మంచి వేదికగా

# దళారులకు ధాన్యం విక్రయించవద్దు..

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధర పొందాలి
- రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు రూ. 20 వేల కోట్లు వెచ్చిస్తున్నాం..
- రైతులకు అందుబాటులో కేంద్రాల ఏర్పాటు..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- కోనరావుపేట, చందుర్తి మండలాల్లో



**కొనుగోలు కేంద్రాల ప్రారంభం**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సకాలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామం, చందుర్తి మండలం సనుగులలో ప్యాక్స్ ఆధ్వర్యంలో వట్టిమల్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, బుధవారం ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ లో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దాదాపు జిల్లా వ్యాప్తంగా 240 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 మద్దతు ధర కల్పిస్తున్నామని తెలిపారు. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 అదనంగా బోనస్ అందిస్తామని ప్రకటించారు. రైతులు అధికారుల సూచన మేరకు ధాన్యం తరలించాలని, తేమ 17 శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. కనగర్తి గ్రామంలో రైతుల సంఖ్య ఎక్కువని, వారికి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని విప్ తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

**రూ. 20 వేల కోట్ల రుణ మాఫీ..**

ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం రూ. 20 వేల కోట్ల రుణ మాఫీ చేసిందని వెల్లడించారు. నూతన రేషన్ కార్డులు జారీ చేశామని,ఇప్పటికే ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేశామని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని విప్ గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని, రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణకు అందరి సలహాలు, సూచనల మేరకు ముందుకు వెళు _న్నామని వివరించారు. రాజన్నకు విశేష పూజలు, భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మూలవాగు, పెంటివాగుపై బ్రిడ్జిలు నిర్మిస్తామని విప్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు కచ్చకాయల ఎల్లయ్య, చెలకల తిరుపతి, వైస్ చైర్మన్లు తాళ్లపల్లి ప్రభాకర్, బొజ్జ మల్లేశం, కోనరావుపేట ప్యాక్స్ చైర్మెన్ బండ నర్సయ్య, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్టిన మట్టిలో కలిసిపోవడానికి..

- గల్ఫ్ నుంచి స్వదేశీ ప్రయాణానికి ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న మృతదేహం..!
- బహరేన్ మార్చురీలో 'గుర్తింపు' సమస్యతో ఐదేళ్లుగా నిల్వచేయబడ్డ మెట్‌పల్లి వాసి మృతదేహం
- సహాయం కోసం 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'ని ఆశ్రయించిన మృతుడి సోదరుడు



మృతుడి సోదరుడు ధర్మపురి ఆనంద్ సహాయం కోసం మంగళవారం (21.10.2025) హైదరాబాద్ లో సీఎం ప్రవాసీ ప్రజావాణి'ని ఆశ్రయించారు.



**బలగం టీవీ, హైదరాబాద్**

బతుకుదెరువు కోసం గల్ఫ్ గడ్డపై అడుగుపెట్టిన ఒక వలసజీవి ఐదేళ్లుగా విగతజీవిగా, బహరేన్ శవాగారంలో 'గుర్తింపు' కోసం వేచిచూస్తు న్నాడు. ఆయన కథ, ఆయన కుటుంబ కష్టం పగవాడికి కూడా రావద్దు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణం రాంనగర్ కు చెందిన శ్రీపాద నరేష్ 18 ఏళ్ల క్రితం 2007లో బహరేన్ వెళ్లి, అక్కడ వివిధ పనుల్లో జీవనోపాధి కోసం శ్రమించారు. ఓ దశలో కంపెనీ వదిలి అక్రమ వలసదారుడిగా మారినట్లు సమాచారం. మొదట్లో కుటుంబంతో సమాచార సంబంధాలు కొనసాగించినా, తరువాత పూర్తిగా సంబంధాన్ని కోల్పోయారు. బహరేన్ లోని ఇండియన్ ఎంబసీ అధికారులను ఉటంకిస్తూ ఇటీవల ఒక పత్రికలో వార్త రావడంతో శ్రీపాద నరేష్ ఐదేళ్ల క్రితం బహరేన్ లో మృతి చెందిన విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడి సోదరుడు ధర్మపురి ఆనంద్ సహాయం కోసం మంగళవారం (21.10.2025) హైదరాబాద్ లో సీఎం ప్రవాసీ ప్రజావాణి'ని ఆశ్రయించారు. నరేష్ మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు సత్వార చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

నరేష్ భార్య శ్రీపాద లత (మునికోట నాగమణి), పిల్లలు లేక ఒంటరిగా తల్లిదండ్రుల ఊరు కలికోట, కథలాపూర్ మండలంలో కడు పేదరికంలో నివసిస్తున్నారు. ఏనాటికైనా తన భర్త వస్తాడని 18 ఏళ్లుగా ఆమె ఎదిరిచూస్తోంది, చివరికి ఇప్పుడు శవమై రాబోతున్నాడు.

ఈ ఆపద సమయంలో మెట్‌పల్లి కి చెందిన గల్ఫ్ కార్మిక హక్కుల కార్యకర్త బొక్కెనపల్లి నాగరాజు, సామాజిక సేవకులు మాడిశెట్టి నాగరాజు, మొరపు తేజ లు మృతుడి సోదరుడి ద్వారా ముఖ్యమంత్రికి దరఖాస్తు చేయించారు. తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి వారికి అండగా నిలిచారు. బహరేన్ లోని సోషల్ వర్కర్ కోటగిరి నవీన్ ఇండియన్ ఎంబసీతో సమన్వయం చేస్తున్నారు.

## రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం శిబిరాల తేదీలు వెల్లడి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, రాజన్న సిరిసిల్ల నందు అక్టోబర్మరియు నవంబర్ నెలల్లో సదరం శిబిరాల నిర్వహణకు సంబంధించిన తేదీలను ఆయా విభాగాల వైద్యులు సూచించారు. ఈ సమాచారాన్ని మండల అభివృద్ధి అధికారులు, సిరిసిల్ల, వేములవాడ కమీషనర్ల దృష్టికి తీసుకువెళ్లాలని కోరనైనది.

దిగువ తెలిపిన తేదీల్లో వివిధ వైకల్యాలకు సంబంధించి క్యాంపులు జరుగుతాయి..

| క్రమసంఖ్య | క్యాంపు తేది | విభాగము |
|---|---|---|
| 1 | 28.10.2025 (మంగళవారం) | ఆర్తో - 34 |
| 2 | 29.10.2025 (బుధవారం) | జనరల్ - 07 |
| 3 | 30.10.2025 (గురువారం) | కంటిచూపు %- 15 |
| 4 | 01.11.2025 (శనివారం) | మానసిక %- 14 |
| 5 | 04.11.2025 (మంగళవారం) | ఆ ర్తో %- 33 |
| 6 | 06.11.2025 (గురువారం) | వినికిడి- 16 ( Hearing & Speech &Language) |
| 7 | 06.11.2025 (గురువారం) | కంటిచూపు - 14 |

(వాశీష ఎఱంఱశీఅ)

పైన తెలిపిన తేదీలలో సదరం శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు ఉదయం 09.30 గంటలకు హాజరు కాగలరు. హాజరయ్యేటప్పుడు దివ్యాంగులు తమ వెంట సంబంధిత మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్ -%రే, UDID అప్లికేషన్ ఫామ్, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో మరియు ఫోన్ నెంబర్ తప్పక తీసుకురావాలి. సదరం క్యాంప్ కు హాజరయ్యే దివ్యాంగుల పేర్లు, వివరాలు పంచాయతీ కార్యదర్శి/మున్సిపాలిటీలోని బిల్లు కలెక్టర్ కు పంపడం జరిగిందని పేర్కొన్నారు.

# అడిలైడ్‌లో చావో రేవో పోరు




- **సిరీస్‌లో నిలవాలంటే**

### టీమిండియా గెలవాల్సిందే

**బలగం టీవీ, అడిలైడ్**

ఆస్ట్రేలియా పర్యటనను ఓటమితో ప్రారంభించిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా గురువారం అడిలైడ్ వేదికగా జరిగే రెండో వన్డేలో ఆతిథ్య ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. వర్షం అంతరాయం కలిగించిన తొలి వన్డేలో ఆసీస్ విజయం సాధించి సిరీస్‌లో 1–0 ఆధిక్యంలో నిలిచింది. దీంతో అడిలైడ్ వన్డే టీమిండియాకు చావో రేవోగా మారింది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే సిరీస్‌లో నిలుస్తుంది, ఓడిపోతే సిరీస్ ఆసీస్ ఖాతాలోకి వెళ్లనుంది. దాంతో ఈ పోరుపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

పెర్త్‌లో జరిగిన తొలి వన్డేలో భారత జట్టు ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్ ఆల్‌రౌండర్లతో బరిలోకి దిగింది. అయితే స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను బెంచ్‌పైనే ఉంచడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. మాజీ క్రికెటర్లు "ఎనిమిది మంది బ్యాటర్లు ఎందుకు?" అంటూ ప్రశ్నించారు. బ్యాటింగ్‌కి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల బౌలింగ్ బలహీనమైందని విమర్శించారు. ఈ నేపథ్యంలో అడిలైడ్ వన్డేలో కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులో చేర్చే అవకాశం ఉంది. స్పిన్‌కు అనుకూలంగా ఉన్న అడిలైడ్ పిచ్‌ను దృష్టిలో ఉంచుకుని ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగవచ్చని సూచనలు ఉన్నాయి. తొలి వన్డేలో విఫలమైన హర్షిత్ రాణా స్థానంలో కుల్దీప్ ఆడే అవకాశం ఉంది.

ఇక బ్యాటింగ్ విభాగంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రీఎంట్రీ ఇచ్చిన తొలి వన్డేలో విఫలమైన నేపథ్యంలో, ఈ మ్యాచ్‌లో వారి ప్రదర్శనపై అందరి దృష్టి నిలిచింది. ఓపెనింగ్‌లో రోహిత్–గిల్ జోడీ మరోసారి అవకాశం పొందనుంది. తొలి వన్డేలో డకౌట్ అయిన కోహ్లీ తనకు సుపరిచితమైన అడిలైడ్ పిచ్‌పై రాణించాల్సిన సమయం వచ్చింది. మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్ కీలక పాత్ర పోషించనుండగా, వికెట్‌కీపర్ కేఎల్ రాహుల్, ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి కీలక పాత్ర పోషించాల్సి ఉంది.

తొలి వన్డేలో బౌలింగ్ విభాగంలో పర్వాలేదనిపించిన సిరాజ్, అర్ష్‌దీప్‌లపై పెద్ద బాధ్యత ఉంది. పాత బంతితో స్పిన్ కీలకం కానుంది. కుల్దీప్ ఆడితే 9వ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లు జట్టుకు బ్యాలెన్స్ ఇస్తారు.యశస్వి జైస్వాల్, ప్రసిధ్ కృష్ణ, ధ్రువ్ జురెల్‌లకు మరోసారి నిరాశే ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎక్స్‌ట్రా పేసర్‌గా నితీష్ కుమార్ రెడ్డి కొనసాగనున్నారు. గౌతమ్ గంభీర్ ఏ జట్టును బరిలోకి దింపుతాడో చూడాలి.

**రెండో వన్డేలో భారత తుది జట్టు (అంచనా):**

శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా / కుల్దీప్ యాదవ్.

## మాగంటి సునీత.. గోపీనాథ్ భార్య కాదు

(మొదటి పేజీ తరువాయి)

2025 జూన్ 8న గోపినాథ్ మరణం వరకు కొనసాగిందని తెలిపారు. ఈ వివాహానికి ఎటువంటి విడాకులు మంజూరు కాలేదని, తానే ఆ చట్టబద్ధమైన వివాహం ద్వారా పుట్టిన ఏకైక కుమారుడినని స్పష్టం చేశారు. ఇక మాగంటి సునీత గోపినాథ్‌తో లివ్ ఇన్ రిలేషన్‌లో మాత్రమే ఉన్నారని, అయినప్పటికీ ఆమె తనను చట్టబద్ధ భార్యగా చూపిస్తూ ఎన్నికల అఫిడవిట్ సహా పలు అధికారిక పత్రాలలో తప్పుడు వివరాలు సమర్పించారని ఆరోపించారు. ఆమె అఫిడవిట్‌లోని సమాచారాన్ని పరిశీలించి తగిన న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రధాన ఎన్నికల అధికారిని కోరారు.

**అన్ని వివరాలు సక్రమమే : మాగంటి సునీత**

ఇక, మరోవైపు మాగంటి సునీత షేక్‌పేట్ ఆర్వో కార్యాలయానికి వచ్చి తన నామినేషన్‌లో పేర్కొన్న వివరాలన్నీ సక్రమమైనవేనని ఎన్నికల అధికారులకు స్పష్టం చేశారు. ఆ మేరకు డిక్లరేషన్ ఫారమ్‌ను సమర్పించారు. ఇప్పటికే ఆమె నామినేషన్ పత్రాలను ఎన్నికల కమిషన్ ఆమోదించింది.

# సెమీస్ ఆశలు నిలవాలంటే గెలవాలి

- **న్యూజిలాండ్‌తో**

### టీమిండియా కీలక మ్యాచ్

**బలగం టీవీ, నవీ ముంబై**




మహిళల వన్డే ప్రపంచకప్ 2025 టోర్నీలో టీమిండియా మరో కీలక పోరుకు సిద్ధమైంది. గురువారం న్యూజిలాండ్‌తో జరగబోయే లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళల జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. వరుసగా మూడు పరాజయాలతో చతికిలపడిన భారత మహిళల జట్టు ఇప్పుడు విజయాల బాట పట్టేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే హర్మన్‌సేన సెమీఫైనల్ ఆశలు సజీవంగా నిలుస్తాయి. ఓటమి పాలైతే మాత్రం సెమీస్ సమీకరణాలు మరింత సంక్లిష్టం కానున్నాయి.

ఇప్పటికే ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఇంగ్లండ్ జట్లు టాప్–3 స్థానాల్లో నిలిచి సెమీస్ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. ఇక నాలుగో స్థానానికి భారత్, న్యూజిలాండ్ మధ్య పోటీ నెలకొంది. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో ఆసక్తి తారస్థాయికి చేరుకుంది.

**గెలిచే మ్యాచ్‌ల్లో ఓటమి బాధ**

గత మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టు గెలిచే స్థితిలో ఉండి చివర్లో తడబడి పరాజయాలు చవిచూసింది. ముఖ్యంగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌ను ఒత్తిడిని తట్టుకోలేక చేజేతులా కోల్పోయింది. ఈసారి మాత్రం ఆ తప్పును పునరావృతం చేయకూడదనే సంకల్పంతో హర్మన్‌ప్రీత్ సేన బరిలోకి దిగనుంది. టీమ్ కాంబినేషన్‌లో స్వల్ప మార్పులు చేసే అవకాశం ఉంది. ఇంగ్లండ్ మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్ స్థానంలో రేణుక సింగ్‌ను చేర్చిన టీమిండియా, ఇప్పుడు మళ్లీ ఆ మార్పును తిరస్కరించే అవకాశముంది.

నవీ ముంబై పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండడంతో పాటు, డ్యూ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భారత జట్టు ఎక్స్‌ట్రా బ్యాటర్‌తో బరిలోకి దిగవచ్చని తెలుస్తోంది. రేణుక స్థానంలో జెమీమా రోడ్రిగ్స్‌ను ఆడించే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు జట్టు వర్గాలు సూచిస్తున్నాయి. అయితే మ్యాచ్ రోజున వర్షం ముప్పు కూడా పొంచి ఉంది. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరగే అవకాశం లేదు.

ఓపెనర్ స్మృతి మంధాన ప్రస్తుతం అద్భుత ఫామ్‌లో ఉంది. ఆమెతో పాటు ప్రతికా రావల్, హర్లీన్ డియోల్‌లు రాణిస్తే టీమిండియాకు గెలుపు సులభం కానుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా మళ్లీ తన ఫామ్‌ను కనుగొంటున్నది. రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, దీప్తి శర్మ కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్యాటర్లు మ్యాచ్ ముగిసే వరకు క్రీజులో నిలబడే లక్ష్యంతో ఆడాలని టీమ్ మేనేజ్‌మెంట్ సూచించింది. బౌలింగ్ విభాగంలో క్రాంతి గౌడ్, శ్రీ చరణి, దీప్తి శర్మ, స్నేహ్ రాణా పర్వాలేదనిపిస్తున్నారు. సమష్టిగా రాణిస్తే టీమిండియా సెమీస్ దిశగా అడుగులు వేయగలదు. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుండగా, స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

**భారత తుది జట్టు (అంచనా):**

స్మృతి మంధాన, ప్రతికా రావల్, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, స్నేహ్ రాణా, దీప్తి శర్మ, రేణుక సింగ్ / జెమీమా రోడ్రిగ్స్, క్రాంతి గౌడ్, శ్రీ చరణి.



# నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం

- **లెఫ్టినెంట్ కల్నల్ హెూదా ప్రదానం**

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత అథ్లెటిక్స్ చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలిచిన ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ నీరజ్ చోప్రాకు భారత సైన్యం అత్యంత అరుదైన గౌరవాన్ని అందించింది. ఒలింపిక్స్‌లో జావెలిన్ త్రో విభాగంలో వరుసగా రెండు పతకాలు సాధించిన నీరజ్ చోప్రాకు బుధవారం భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది లెఫ్టినెంట్ కల్నల్ హెూదాను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం ఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి నీరజ్ చోప్రా కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "నీరజ్ చోప్రా పట్టుదల, క్రమశిక్షణ, దేశభక్తికి ప్రతీక. అతని విజయాలు భారత క్రీడా చరిత్రలో మైలురాయిలుగా నిలిచాయి. ఆయన రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారు," అని కొనియాడారు.

2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించి అథ్లెటిక్స్ విభాగంలో గోల్డ్, సిల్వర్ రెండు పతకాలు గెలుచుకున్న తొలి భారత క్రీడాకారుడిగా నీరజ్ చోప్రా చరిత్ర సృష్టించాడు. 2016లో భారత సైన్యంలో సుబేదార్‌గా చేరిన నీరజ్, 2021లో మేజర్ హెూదా పొందాడు. 2022లో 'పరమ విశిష్ట సేవా' పతకంతో కేంద్ర ప్రభుత్వం ఆయనను సత్కరించింది. ఇప్పుడు ఆయన లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి పొందారు. భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన 'మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న'ను 2021లో స్వీకరించిన నీరజ్ చోప్రా, 2022లో 'పద్మశ్రీ' అవార్డుతో గౌరవించబడ్డారు. ఈ గౌరవంతో ఆయన రికార్డు జాబితాలో మరో ఘనత చేరింది. క్రికెట్ దిగ్గజాలు మహేంద్ర సింగ్ ధోనీ, కపిల్ దేవ్‌లకు కూడా ఇంతకుముందు భారత సైన్యం గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హెూదాను ప్రదానం చేసింది. ధోనీకి ఈ గౌరవం 2011లో ప్రాదేశిక సైన్యం ద్వారా లభించింది. ఆయన తర్వాత ప్యారాట్రూపర్ శిక్షణ పూర్తి చేసి, 2019లో తన బెటాలియన్‌తో కలిసి కాశ్మీర్ లోయలో 15 రోజుల పాటు పెట్రోలింగ్, గార్డ్ డ్యూటీల్లో పాల్గొన్నారు. నీరజ్ చోప్రా లెఫ్టినెంట్ కల్నల్ హెూదా అందుకోవడం భారత క్రీడల గర్వకారణంగా నిలిచింది.

## చెక్ పోస్టులు మూసివేత

(మొదటి పేజీ తరువాయి)

1.13 శాతానికి పెరిగాయని తెలిపారు. అలాగే హైదరాబాద్ సిటీలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలు, 10వేల ఎల్‌పీజీ, సీఎన్‌జీ ఆటోలకు అనుమతులు ఇచ్చామని చెప్పారు. త్వరలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వాహన్ సారథి పాలసీని అమల్లోకి తెస్తున్నామనీ, ప్రస్తుతం డేటా బదిలీ జరుగుతున్నదని తెలిపారు. స్క్రాప్ పాలసీకి మంచి స్పందన వచ్చిందన్నారు. రవాణాశాఖ కార్యాలయాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)ని, ప్రధాన కార్యాలయానికి అనుసంధానం చేస్తామన్నారు. వెహికిల్ ట్రాకింగ్ ప్రాసెస్ కొనసాగిస్తున్నామనీ, డ్రైవింగ్ మంచి నైపుణ్యాలు పెంచుతూ, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. వాహనం కొన్న వెంటనే షోరూముల్లోనే రిజిస్ట్రేషన్లు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామనీ, త్వరలో దీన్ని అమల్లోకి తెస్తామన్నారు. దీనివల్ల వాహనదారులు ఆర్టీఏ కార్యాలయాలకు రావల్సిన అవసరం ఉండదని తెలిపారు. టూరిజం వెహికల్స్ డబుల్ నెంబర్‌ప్లేట్స్‌తో నడుస్తున్నాయనీ, అందువల్ల హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్‌ను తప్పనిసరి చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో క్యాష్‌లెస్ ట్రీట్మెంట్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందనీ, దీని అమలుపై మెడికల్, పోలీస్, నేషనల్ హైవేస్‌తో సమీక్షా సమావేశం నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఓవర్‌లోడింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తామనీ, ఎక్కువ రోడ్డు ప్రమాదాలకు ఇదీ ఓ కారణమేనని వివరించారు. రాష్ట్రంలో ఏటా వాహనాల సంఖ్య పెరుగుతోందనీ, ప్రస్తుతం 1.70 కోట్ల వాహనాలు ఉన్నాయని చెప్పారు. రవాణాశాఖలోని 63 కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ జరుగుతోందనీ, బ్రోకర్ వ్యవస్థను అరికట్టడానికి కఠినచర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీస్, ఆర్టీసీ ఇతర ప్రభుత్వ విభాగాల్లో పాత వాహనాలకు స్క్రాప్‌కి పంపించాలని లేఖలు రాసామని తెలిపారు. సమావేశంలో రవాణాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ పాల్గొన్నారు.

## గుమ్మడి నర్సయ్య జీవితం సిల్వర్ స్క్రీన్‌పై..

- **శివరాజ్‌కుమార్ ప్రధాన పాత్రలో బయోపిక్**

**బలగం టీవీ, హైదరాబాద్**




పేద ప్రజల కోసం ఆలోచించే రాజకీయ వేత్తగా, ప్రజానాయకుడిగా గుమ్మడి నర్సయ్యకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న పేరు ప్రఖ్యాతుల గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. నిజమైన ప్రజా నాయకుడు అంటే ఎలా ఉండాలో చూపించిన వ్యక్తిగా ఆయన ప్రస్థానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఇప్పుడు ఆ ప్రజా నాయకుడి జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఓ బయోపిక్ తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి 'గుమ్మడి నర్సయ్య ' అనే టైటిల్‌ను మేకర్స్ ఫిక్స్ చేశారు. ఈ టైటిల్‌తోనే చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది.

కన్నడ స్టార్ హీరో, కరుణాడ చక్రవర్తి శివరాజ్‌కుమార్ ఈ చిత్రంలో గుమ్మడి నర్సయ్య పాత్రలో కనిపించబోతున్నాడు. తెల్ల ధోతి, రంగు చొక్కా, భుజాన ఎర్ర కండువా వేసుకుని, సైకిల్‌ను తోసుకుంటూ వెళున్న ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సైకిల్ హ్యాండిల్‌కు CPI(ML) జెండా కట్టిన విధానం, అసెంబ్లీ ముందు బుగ్గకార్లలో వచ్చే ఇతర ప్రజాప్రతినిధులతో పోలిస్తే సాదాసీదాగా సైకిల్‌పై వచ్చే గుమ్మడి నర్సయ్య తీరు, ఆయన ఆచరణను ప్రతిబింబిస్తోంది. ఫస్ట్ లుక్ ద్వారా సినిమా తాలూకు టోన్, స్ఫూర్తి ఏంటో దర్శకుడు ఇప్పటికే స్పష్టంగా తెలిపాడు. గుమ్మడి నర్సయ్య వంటి నిజాయితీ గల నాయకుడు జీవితం, ప్రజలతో ఆయన అనుబంధం, విలువల ఆధారంగా సాగనున్న ఈ బయోపిక్ సామాన్య ప్రజల మనసులను తాకేలా ఉండబోతోందని చిత్రబృందం చెబుతోంది. ఈ సినిమాకు దర్శకుడు పరమేశ్ హివ్‌రాలే, 'చిరు గొడవలు', 'లావణ్య విత్ లవ్ బాయ్స్' వంటి చిత్రాల్లో నటించి, ఇప్పుడు దర్శకుడిగా మారుతున్నాడు. ఆయన దర్శకత్వ ప్రస్థానాన్ని ప్రారంభించబోతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.ఈ చిత్రాన్ని ప్రవళ్లిక ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎన్. సురేశ్ రెడ్డి నిర్మిస్తున్నారు. సంగీతాన్ని సురేశ్ బొబ్బిలి అందిస్తున్నారు.